క్లుప్తంగా

దీపావళి ప్రతి ఇంట్లో సంతోషం నింపాలి

మంత్రి దామోదర రాజనర్సింహా



సంగారెడ్డి జోన్: దీపావళి పండుగ ప్రతి ఇంట్లో జ్ఞానం, సంతోషం, శ్రేయస్సు, వెలుగులు నింపాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆయన లక్ష్మీదేవిని ప్రార్థించారు. ఈ పండుగ జిల్లా ప్రజల్లో నూతన ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని అందించాలని మంత్రి పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ప్రజలు బాణసంచా విషయంలో జాగ్రత్తలు తీసుకుని, సురక్షితంగా దీపావళిని జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీలో పలువురు చేరిక



ఎంపీ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం సిరిపుర గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరినట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగబాబు గౌడ్ తెలిపారు. సిరిపురం గ్రామానికి చెందిన చంద్రమోహన్ రెడ్డితో పాటు పలువురు నాయకులు హత్నూర మండల బీజేపీ అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో బీజేపీ చేరారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ మాట్లాడుతూ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి బీజేపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తలారి మల్లేశ్, నాగరాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మహేశ్, సింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన ఆలయాలతో ఆధ్యాత్మిక శోభ

బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి



విరాళం అందజేస్తున్న గోవర్ధన్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): దేవాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గుమ్మడిదల మండల పరిధి కానుకుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ నెలకొందన్నారు. ప్రతి ఒక్కరూ దైవచింత అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేశం గౌడ్, మాజీ ఉపసర్పంచ్ భార్గవ్ చారి, నాయకులు శ్యామల కరుణాకర్ రెడ్డి, వెంకటేశ్, స్థానికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సైదా

జహీరాబాద్ : చిరు వ్యాపారులకు కిద్మత్ బ్యాంకు అందిస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ సైదా సూచించారు. ఆదివారం పట్టణంలోని మంకాల్ కాంప్లెక్సులో నిర్వహించిన 14వ వార్షిక జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చిరు వ్యాపారులకు రుణాలు అందాలన్నా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. రుణం సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే రుణాలు పొందేందుకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. సమావేశంలో బ్యాంకు ఎండీ ఎక్బాల్ హుసేన్, సీఈఓ ఎక్బాల్ మొహియొద్దీన్ ముంతాజ్, జిల్లా అధ్యక్షుడు అన్వర్‌లతో పాటు రఫియొద్దీన్, అయూబ్, నసీరుద్దీన్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని రేజింతల్ గ్రామశివారులో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను హద్నూర్ పోలీసులు అరెస్టు చేశారు. అంజిరెడ్డి వ్యవసా య పొలం వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ సుజిత్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,690 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కుక్కల బెడద తీరేదెన్నడో?

జాడలేని కు.ని శస్త్రచికిత్సలు

- వీధుల్లోకి వెళ్లాలంటే జంకుతున్న జనం
- ద్విచక్ర వాహనదారుల ఆందోళన
- చర్యలు చేపడతామంటున్న అధికారులు



సంగారెడ్డిలో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువవుతోంది. కుక్కలు గుంపులు గుంపులుగా వీర విహారం చేస్తున్నాయి. చిన్నాపెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పలు ప్రాంతాల్లో రోడ్లపైకి వెళ్లాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. జిల్లాలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, నారాయణఖేడ్, జహీరాబాద్, జోగిపేట్, సదాశివపేట మున్సిపాలిటీతో పాటు పలు మండలంలోని గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువవుతోంది. గతంలో ఆయా మున్సిపాలిటీల్లో కుక్కలను బంధించి అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టేవారు. ప్రస్తుతం అలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కుక్కల సంతతి సైతం పెరిగింది. కుక్కలు దాడులు చేస్తుండటంతో పలువురు గాయాల పాలై ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.

రహదారుల వెంట వెళ్లే ప్రజలు, మూగజీవాలు, పశువులపైకి కుక్కలు పరుగులు తీసి దాడులు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట కుక్కలు వెంబడిస్తుండటంతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లేవారు కుక్కల బారిన పడి గాయాల పాలవుతున్నారు.

కుక్కలకు కు.ని శస్త్ర చికిత్సలు ఏవీ?

కుక్కల సంఖ్య పెరగకుండా జంతు సంతాన నిరోధక కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టడం లేదు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి జిల్లా, మున్సిపల్ శాఖ అధికారులు టెండర్లు పిలిచి ఏజెన్సీలకు బాధ్యతలకు అప్పగించాల్సి ఉంటుంది. ఏజెన్సీ నిర్వాహకులు శునకాలను నియంత్రణ కేంద్రాలకు తీసుకువెళ్లి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించాలి. అనంతరం రేబిస్ టీకా ఇప్పించి ఎక్కడి నుంచి వాటిని తీసుకొచ్చారో అక్కడే వదిలివేయాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఇలా జరగడం లేదు. వీధి కుక్కలకు టీకాలు వేయాల్సి ఉండగా అధికారులు పట్టించుకోకపోవడంతో కుక్కల బెడద తీవ్రమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

కుక్కకాటుకు పలువురికి గాయాలు

ఇస్నాపూర్‌లో మున్సిపాలిటీ పరిధిలోని ఇస్నాపూర్‌లో గత ఏడాది ఏడేళ్ల బాలుడిని వీధికుక్కలు గుంపుగా దాడి చేసి చంపేశాయి. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో మహిళాపై రోడ్డుపై వెంటాడాయి. జహీరాబాద్ పట్టణంలో కుక్కలు దాడి చేసి 16 మందిని గాయం చేశాయి. ఇలా పలు సంఘటనలు జరుగుతున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదు.

డ్రైవ్‌లు ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో కుక్కలను నియంత్రించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేయాలి. వందల సంఖ్యల్లో పెరిగిపోతున్నాయి. గ్రామాల్లో కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి. పలు కాలనీల్లో రోడ్లపై గుంపులుగుంపులుగా సంచరించడంతో పాఠశాలలకు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. వెంటనే జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలి.

– ప్రవీణ్, ఘనల్పాది

కుక్కల నివారణకు చర్యలు



జిల్లాలో కుక్కల బెడద నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కుక్కలు టీకా వేయడం, శస్త్ర చికిత్సలు చేయడంపై దృష్టి సారించాం. జిల్లాలో అవసరమైన చర్యలు తీసుకుంటాం.

–వసంతకుమారి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

కంచె ట్రాన్స్‌ఫార్మర్‌కా..? దిమ్మెకా..?



దిమ్మెకు ఏర్పాటు చేసిన కంచె

సంగారెడ్డి జోన్: విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు దిమ్మలపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలను ఏర్పాటు చేయడం సాధారణం. కానీ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కాకుండా పక్కన ఖాళీగా ఉన్న దిమ్మెకు కంచె ఏర్పాటు చేశారు. నిత్యం జిల్లా ఉన్నతాధికారులు ఇదే రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం కంచెను ఈ విధంగా ఏర్పాటు చేయడంపై ఇదేమి విచిత్రమని చర్చించుకుంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు పక్కనే ఉన్న కంచెకు పిచ్చి మొక్కలతో ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని దిమ్మెకు కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

టపాకాయల దుకాణాల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సంగారెడ్డి క్రైమ్: దీపావళి పండుగను పురస్కరించుకొని దుకాణదారులు ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫైర్‌శాఖ అధికారి బి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో సిబ్బందితో కలిసి టపాకాయల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టపాకాయల దుకాణదారులు కచ్చితంగా అన్ని శాఖల అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. దుకాణాల పరిధిలో రెండు డ్రమ్ముల నీరు, రెండు బకెట్ల ఇసుక, ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండాలని సూచించారు. పట్టణంలోని బైపాస్ మార్గంలో అనుమతులు లేని పలు దుకాణాలను సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మార్వో జయరాం, పట్టణ పోలీసులు, ఫైర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జహీరాబాద్ : మండలంలోని అల్గోల్ ఉన్నత పాఠశాలలో 2019–20లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరి రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులు మల్లయ్యస్వామి, జైపాల్, శ్రీలత, వరకుమారి, మిరాజ ఫాతిమలను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంగమేశ్వర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

దీపారాధనతో దివ్యానుగ్రహం



ప్రవచనం వినిపిస్తున్న విభీషణ్ ప్రభు

జహీరాబాద్: యశోద మాత ప్రేమ బంధానికి కట్టుబడిన దామోదరునికి భక్తి అనే దీపాన్ని సమర్పించడం ద్వారా దివ్యానుగ్రహం పొందవచ్చని కందిలోని హరేకృష్ణ టెంపుల్ ప్రతినిధి విభీషణ్ ప్రభు అన్నారు. ఆదివారం హనుమాన్ మందిరంలో 177వ నగర సంకీర్తన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృందే దేవి తులసి హారతి, దామోదర అష్టకం నిర్వహించారు. అనంతరం సత్సంగ సమావేశంలో ఆయన ప్రవచనం చేశారు. అశ్వియుజ పౌర్ణమి నుంచి కార్తీక పౌర్ణమి వరకు నెల రోజుల వ్యవధిని అత్యంత పరమ పునీతమైన మాసంగా అభివర్ణిస్తూ ఈ సమయంలో దామోదరునికి దీపారాధన చేయడం ద్వారా పూర్వ జన్మదోషాలకు సైతం మోక్షం కలుగుతుందని పేర్కొన్నారు. జీవితంలో ఒక్కసారి అయినా బృందావనాన్ని దర్శించాలని సూచించారు.

గల్లంతైన మత్స్యకారుడి శవం లభ్యం

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టులో శుక్రవారం గల్లంతైన మత్స్యకారుడు కుమార్(35), మృతదేహం ఆదివారం నీటిపై తేలింది. సదాశివపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన కుమార్ గతకొన్ని సంవత్సరాలుగా సింగూరు ప్రాజెక్టులో చేపలు పడుతూ జీవిస్తున్నాడు. శుక్రవారం డ్యాంలో చేపల వలలు వేస్తున్న క్రమంలో తెప్ప పై నుంచి జారిపడి గల్లంతయ్యాడు. మత్స్యకారులు వెతికిన కుమార్ ఆచూకీ లభించలేదు. మూడో రోజుల తరువాత ఆదివారం నీటిపై శవమై తేలాడు. పుల్‌కల్ పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమర్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

పుల్‌కల్(అందోల్): మండల పరిధి ముద్దాయిపేటలో ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. టొటకూర్, పుల్‌కల్ మండలానికి చెందిన వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. యంగర్స్ యూత్ ముద్దాయిపేట ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.

అలంకారప్రాయంగా వాటర్ ట్యాంక్‌లు



చెడిపోయిన బోరు మోటారు

జహీరాబాద్ : పట్టణంలోని పలు వార్డుల్లో నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌లు అలంకారప్రాయంగా మారాయి. ప్రజల నీటి సౌకర్యం కోసం పలు వార్డుల్లో లక్షల రుపాయలు ఖర్చు చేసి మున్సిపల్ అధికారులు బోర్లు తవ్వించి, వాటికి మోటార్లు బిగించి, మినీ వ్యాటర్ ట్యాంక్‌లు నిర్మించారు. పలు ప్రాంతాల్లోని బోరు మోటార్లు చెడిపోయిన మరమ్మతులు చేయడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు వీటి గురించి పట్టించుకోవడం లేదని తెలిపారు. చెడిపోయిన బోరు మోటార్ల రిపేర్ల కోసం వేల రూపాయల బిల్లులు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్నారు. కాని, చాలా వరకు బోర్లు మరమ్మతులకు నోచుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. చెడిపోయిన బోరు మోటార్లకు రిపేర్ చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

జహీరాబాద్: కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయింది. గ్రామానికి చెందిన ఎల్లంబావి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రి వైద్యులు రోగులకు పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఆర్థో, ప్రసూతి, ఈఎన్‌టీ, సాధారణ వ్యాధులతో పాటు పలు రోగాలకు సంబంధించి 200 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొగులయ్య, నర్సింహారెడ్డి, వైద్యులు అక్షయ్, పృథ్వి, ప్రవళిక, శరత్, హైమావతి, వద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సదన్‌లో..

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని సత్యసాయి సేవా సదన్‌లో మెడికవర్ ఆస్పత్రి వారి సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎత్తు, బరువు, దంత, రక్తపోటు, షుగర్, పల్స్, ఈసీజీ, నేత్ర, ఊపిరితిత్తుల మొదలగు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మారిన జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పుల వల్ల ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. ఈ వైద్య శిబిరంలో సత్యసాయి సేవా సదన్ కమిటీ సభ్యులు రామచంద్రమూర్తి, రుద్రరాజు, రాజగోపాలరావు, ఉదయ శంకర్, చంద్రమ్మ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, విష్ణు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై కల్లాలు ఏర్పాటు చేయొద్దు



గోమారం–చిన్నగొట్టిముక్ల రోడ్డుపై రైతులకు సూచనలు ఇస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్లపై రైతులు కల్లాలు ఏర్పాటు చేయొద్దని పోలీసులు సూచించారు. ఆదివారం చిన్నగొట్టిముక్ల–గోమారం ప్రధాన రహదారిపై పలువురు రైతులు ధాన్యం కల్లాలు ఏర్పాటు చేయడంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ధాన్యం చేతికొస్తున్న తరుణంలో రోడ్లపై ఆరబెట్టడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రోడ్డుపై కల్లాలు ఏర్పాటు చేయడంతో బైక్‌లు అదుపుతప్పి కిందపడి మృతి చెందడంతో పాటు పలువురు గాయాల పాలైన ఘటనలు జరిగాయన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా రైతులు సహకరించి బీటీ రోడ్లపై ధాన్యం ఏర్పాటు చేయకూడదని సూచించారు.

కొనసాగుతున్న రోడ్డు పనులు



చెట్ల తొలగింపుతో విశాలమైన రోడ్డు

మునిపల్లి(అందోల్) : తాటిపల్లి, పిల్లోడి, చౌరస్తా నుంచి మక్తక్యాసారం గ్రామం వరకు డబుల్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఆదివారం పిల్లొడి చౌరస్తా నుంచి పెద్దలోడి గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపుల ఏపుగా పెరిగిన చెట్లను తొలగించే కార్యక్రమం నిర్వహించారు. మక్తక్యాసారం వరకు బీటీ రోడ్డు పనులు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బీటీ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 22 కోట్ల మంజూరు చేసిన విషయం తెలిసిందే. రోడ్డు మధ్యన ఏర్పడిన గుంతలను లేవల్ చేసుకుంటూ బీటీ పనులను నిర్వహించడానికి మెటీరియల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

అతిథి గృహం.. శిథిలమయం

శిథిలావస్థలో 'పేట' విశ్రాంతి భవనం

- కళతప్పిన గెస్ట్‌హౌస్
- పెచ్చులూడుతున్న పైకప్పు
- 80 సంవత్సరాల క్రితం నిర్మాణం



శిథిలావస్థకు చేరిన సదాశివపేట అతిథిగృహం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రముఖులెందరికో ఆతిథ్యం ఇచ్చిన అలనాటి అద్భుతమైన విశ్రాంతి భవనం నేడు శిథిలావస్థకు చేరింది. దాదాపు 80ఏళ్ల నాటి అతిపురాతనమైన భవనం కొన్ని తరాల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, పాలకులకు ఎందరికో ఆతిథ్యం ఇచ్చిన భవనం నేడు కళాహీనంగా మారింది. వర్షం కురిస్తే భవనం మొత్తం తడిగా మారుతుంది. తరుచుగా పైకప్పు, గోడలు పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ప్రమాదం పొంచి ఉంది. దాదాపుగా 18 సంవత్సరాలుగా నిర్వహణ లేకపోవడంతో భవనం ఆవరణ చుట్టూ పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుంది. రాత్రి అయితే మందుబాబులక్కు అడ్డాగా మారుతుంది. సమయం తప్పి అత్యవసర పరిస్థితుల్లో ఒక రాత్రికి విశ్రాంతి తీసుకోని వెళ్దామన్న వెళ్లలేని పరిస్థితి దాపురించింది. ఎలాంటి ప్రమాదం జరగక ముందు అధికారులు, ప్రభుత్వం మేల్కొని నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా నూతన గెస్ట్ హౌస్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకురాలని కోరుతున్నారు.

మా దృష్టిలో ఉంది

ప్రభుత్వ అతిథి గృహం శిథిలావస్థకు చేరిన విషయం మా దృష్టిలో ఉంది. మరమ్మతులు చేపట్టడానికి గతంలోనే రూ. 10 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరయ్యే అవకాశం ఉంది. నిధులు మంజూరు కాగానే తాత్కాలికంగా మరమ్మతులు చేస్తాం.

రామకృష్ణ ఆర్అండ్‌బీ డీఈఈ సంగారెడ్డి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనర్సింహస్వామి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి శివ్వప్ప నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులు ఒడి బియ్యం సమర్పించడంతోపాటు కుంకుమార్చనలు నిర్వహించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది ఉన్నారు.

సికింద్లాపూర్‌లో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంతో పాటు కొండపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్, అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి, తదితరులు ఉన్నారు.